క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల సందర్శన



ఫిరంగిపురం: హౌస్‌గణేష్, ఫిరంగిపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల సెక్టోరియల్ అధికారి సుబాని, రూట్ అధికారి నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సుబాని మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హౌస్ గణేష్‌లోని ఎయిడెడ్ పాఠశాల, ఫిరంగిపురంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లోని పోలింగ్ బూతులను పరిశీలించామన్నారు. సౌకర్యాలు, మంచినీటి సదుపాయాలను పరిశీలించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో మాట్లాడి తగిన సూచనలు అందజేసినట్లు చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి సలాం హోటల్ సెంటర్‌లో మంగళవారం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌత్ వన్ డివిజన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భాస్కర్ రెడ్డి, శంకర్‌రెడ్డి మాట్లాడుతూ గూడ్స్ షెడ్ యార్డ్‌లో పనిచేస్తున్న ముఠా కార్మికులు సుమారు 300 మందికి షుగర్, బీపీ, కంటి, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు అందజేసినట్లు చెప్పారు. కంటి అవసరమైన వారికి కళ్లజోళ్లు త్వరలో అందజేస్తామని చెప్పారు. గుడ్స్‌షెడ్ యార్డ్ మేస్త్రి కె.శ్రీనివాసరావు, తుడిమెల్ల వెంకటయ్య, పుప్పాల నాగయ్య, మాకం ఎర్రయ్య పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామి కల్యాణం



కాకుమాను: స్థానిక గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుంటూరులోని ఆర్.అగ్రహారంకు చెందిన ఆలపాటి సాంబశివరావు(85), 2019లో బాలికపై లైంగిక దాడికి పాల్పడి జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. 2021 జూలై 3వ తేదీన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి చేర్చారు. అనారోగ్యానికి గురి కావడంతో ఈ నెల 13వ తేదీన జైలు అధికారులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు అదే రోజు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాంబశివరావు మంగళవారం మృతి చెందగా కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

శిశు మరణాలపై దృష్టి పెట్టండి

గుంటూరు మెడికల్: నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ కోరారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నవ జాతా శిశు సంరక్షణ అవసరం అంశంపై మంగళవారం సింపోజియం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవ జాతా శిశువుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. నవ జాత శిశువుల జననానికి ముహుర్తాలు నిర్ణయించి ఆపరేషన్లు చేయాలని తల్లిదండ్రులు కోరుకోవడం బాధాకరమన్నారు. విద్యావంతులు కూడా అవగాహనా లేకుండా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆధునిక వైద్యాన్ని అభ్యసించి వైద్యులు ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధా రమణ శ్రీ, శాంత కుమారి పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట 2/7లోని శ్రీ గౌరి విశ్వేశ్వర స్వామి దేవాలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విశ్వేశ్వర శర్మ దంపతులతో కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పొన్నలూరి సీతారామాంజనేయులు, సీతారత్నకుమారి, ఉప్పులూరి గణేష్, కుమారి దంపతులు పాల్గొన్నారు. అర్చకులు పూజా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం



నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

మంగళగిరి: నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులకు ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. నగరంలో విలీనమైన గ్రామాలతో సహా దుగ్గిరాల మండలంలోని గ్రామాల్లో లింకురోడ్లు, డొంకరోడ్లు, గ్రావెల్ రోడ్లు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. నగరంలో ఫ్లెక్సీలు కనిపించడానికి వీలు లేదని, పార్టీలతో సంబంధం లేకుండా వెంటనే రోడ్లపై ఫ్లెక్సీలను తొలగించాలని అధికారులను కోరారు. గౌతమబుద్ధా రోడ్డు విస్తరణ చేసిన నేపథ్యంలో రోడ్డుపై వాహనాలు ఆపడం, ఆక్రమణల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఆక్రమణలు తొలగించాలని సూచించారు. సచివాలయానికి రూ. 50 లక్షల చొప్పున నిధులు విడుదల చేసిన నేపథ్యంలో ఆయా సచివాలయాల పరిధిలో తాగునీరు, సీసీ రోడ్లు, పైపు లైన్లు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పట్టణంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద కోనేరు(కల్యాణ పుష్కరిణి) అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రగడ కోటయ్య చేనేత భవన్‌లో దుకాణాలను అర్హులైన వారికే కేటాయిస్తామన్నారు. మరికొన్ని రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఎన్నికలు అయిన వెంటనే తెనాలి రోడ్డు విస్తరణ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కరోనా సమయంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



తుళ్ళూరులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీడీవో శివన్నారాయణ, డీఎల్‌డీవో



తాడికొండలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

వలంటీర్లకు వందనం కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు

తాడికొండ: కరోనా కష్ట కాలంలో ప్రాణాలు కూడా లెక్క చేయకుండా పనిచేసిన వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని తాడికొండ ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకం దరిచేరాలంటే జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరిగి ముడుపులు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు ఆ పరిస్థితికి స్వస్తి పలికి.. వలంటీర్ల వ్యవస్థతో వైఎస్సార్ సీపీకి ప్రభుత్వానికి ప్రజాదరణ పెరిగిందన్నారు. ఈ సందర్భంగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పలు అవార్డులు అందుకున్న వలంటీర్లు తమ అనుభవాలను సభ సాక్షిగా పంచుకున్నారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో అనురాధ, సర్పంచ్ సరోజినీ వలంటీర్లను సత్కరించి, అవార్డులు అందజేశారు. వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, నిడుముక్కల, రావెల సర్పంచ్‌లు మాదాసు రత్నకుమారి, రావెల శైలజ, తుమ్మల తిరుపతిరెడ్డి, మల్లంపాటి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరులో..

తుళ్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి సుజాత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందించడంలో వలంటీర్ వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం వలంటీర్లకు గతం కంటే ప్రోత్సాహకాలను పెంచిన విషయం గుర్తుచేస్తూ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం డీఎల్‌డీవో, ఎంపీడీవో శివన్నారాయణ వలంటీర్లను సత్కరించి, అవార్డులు అందించారు. ఏపీఎం చిన వీరయ్య, సీనియర్ నాయకులు కొప్పుల శేషగిరిరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నాయుడు నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నాటికల పోటీలు



తెనాలిటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పరిషత్ పోటీలు జరుగుతున్నాయి. పోటీలలో తొలుత బసవరాజు జయశంకర్ పర్యవేక్షణలో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారి 'బహురూపి' నాటికను ప్రదర్శించారు. శిష్టా చంద్రశేఖర్ రచించిన ఈ నాటికకు కె.వి.ప్రసాద్ దర్శకత్వం వహించారు. పట్టణంలో సేవా రంగ ప్రముఖులు అయిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి బ్రాంచి చైర్మన్ ఉమ్మలనేని భానుమతి, శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీనులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం రెండో ప్రదర్శనగా ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి 'క్షేత్రం' నాటికను ప్రదర్శించారు. శిల్ప ఆకురాతి రచన చేయగా జి.మనోహర్ దర్శకత్వం వహించారు. సాంఘిక నాటక రంగంపై సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, ప్రముఖ నాటక రచయితలు డాక్టర్ చిలువూరు నాగేశ్వరరావు, ఆకురాతి భాస్కర్ చంద్రలు సమీక్ష జరిపారు. అనంతరం తృతీయ ప్రదర్శనగా కళావర్షిణి హైదరాబాద్ వారి 'అజరామరం' నాటికను ప్రదర్శించారు. హరిబాబు జెట్టి రచన, దర్శకత్వం వహించారు. మూడు నాటికల పోటీల కళాకారులకు ప్రదర్శన పారితోషకాన్ని ప్రణాళిక శాఖ ఉప కార్యదర్శి ఎ.వి.సుబ్బారావు, కావూరి సత్యనారాయణలు అందజేశారు. నాటక కళా పరిషత్ నిర్వాహకులు ఆరాధ్యుల కన్నా, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి, పిట్టు వెంకట కోటేశ్వరరావు, కళాకారుల సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, తదితరులు పర్యవేక్షించారు.

యువతి అదృశ్యం



పెదకాకాని: మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పెదకాకాని సుందరయ్యకాలనీకి చెందిన షేక్ నన్నీబి మస్తాన్ దంపతులకు నలుగురు సంతానం. వారిలో మూడో కుమార్తె షేక్ రంజాన్‌బీకి చిన్నతనం నుంచి మతిస్థిమితం లేదు. చిన్నపిల్లలాగా ఇంటి పక్కల ఉన్న వారితో ఆడుకుంటూ ఉంటుంది. సోమవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో కాలనీలో కనిపించలేదు. చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల్లో విచారించినప్పటికీ ఆచూకీ కనిపించలేదు. దీంతో రంజాన్‌బీ తల్లి నన్నీబీ పెదకాకాని పోలీసులను ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

క్రీడలను ప్రోత్సహించడంలో కేఎల్‌యూ ముందంజ



ఖోఖోలో ప్రథమ స్థానం సాధించిన హైదరాబాద్‌కు చెందిన జీఎన్ఐటీఎస్ విద్యాసంస్థ విద్యార్థులు



చదరంగంలో ప్రథమ స్థానం సాధించిన శంకర్ రెడ్డికి మెమొంటో అందజేస్తున్న డీన్ హరికిషోర్

యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ కె హరికిషోర్

తాడేపల్లిరూరల్: క్రీడలను ప్రోత్సహించడంలో కేఎల్ యూనివర్సిటీ ముందుంటుందని క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో జాతీయస్థాయిలో జరుగుతున్న కోనేరు లక్ష్మయ్య మెమోరియల్ ట్రోఫీ-2024 సందర్భంగా ఆయా క్రీడల్లో విజేతలకు మంగళవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీని 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని, ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జరుగుతున్న ఈ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాల నుంచి సుమారు 480 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. మంగళవారం ఖోఖో మహిళల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన జీఎన్ఐటీఎస్ విద్యాసంస్థ విద్యార్థులు పి.ధరణి జట్టు ప్రథమ స్థానం సాధించగా, విజ్ఞాన్ యూనివర్సిటీ వడ్లమూడి విద్యార్థులు కె.శ్యామ సుకన్య జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారని వివరించారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థి సీహెచ్ వినయ్ ప్రథమ స్థానం సాధించగా, కేఎల్‌యూ వడ్డేశ్వరం విద్యార్థి పూజిత్‌రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచాడని, చదరంగంలో విట్ ఏపీ విద్యార్థి హేమంత్ శంకర్‌రెడ్డి ప్రథమ స్థానం సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సీహెచ్ హనుమంతరావు, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఆర్.సుభాకర్‌రాజు, వ్యాయామ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు

- జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి.తారాసత్యవతి
- కొల్లిపర మండలం దావులూరులో 11 రకాల సజ్జ, 10 రకాల జొన్న సాగు పరిశీలన



సజ్జ పైరును పరిశీలిస్తున్న డాక్టర్ సి.తారాసత్యవతి, డాక్టర్ సుబ్బారాయుడు, రైతులు

తెనాలి: వరి, గోధుమలకు మించిన పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని హైదరాబాద్‌లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి చెప్పారు. ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో కొల్లిపర మండలం దావులూరులో 11 రకాల సజ్జ, 10 రకాల జొన్న పంటను సాగుచేసిన అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్ పంటపొలాన్ని మంగళవారం సందర్శించారు. ఏపుగా పెరిగిన ఆయా రకాలను రైతులకు చూపారు. అక్కడే చిరుధాన్యాల ఆవశ్యకతను, సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో రైతులకు అధిక ఆదాయంతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారం లభిస్తుందన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఆ పంటల సాగు పెరుగుతోందని, దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పెరిగిందన్నారు. డెల్టాలో ఖరీఫ్ వరి సాగు తర్వాత జొన్న, సజ్జతో పాటు ఇతర చిరుధాన్యాలను జీరో టిల్లేజ్ విధానంలో సాగు చేపట్టాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడి ప్రాసెసింగ్ చేసుకుని అమ్మగలిగితే మరింత ఆదాయం లభిస్తుందని చెప్పారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుబ్బారాయుడు తన ప్రసంగంలో, ఐఐఎంఆర్ 11 రకాల సంకరజాతి జొన్న విత్తనాలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇక్కడి రైతులు సాగుచేసే జొన్నలో ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే, ఐఐఎంఆర్ రకాల్లో 40-50 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయన్నారు. అధ్యక్షత వహించిన 'ఆత్మ' ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ, లాభదాయకంగా ఉంటుందనే భరోసా ఇవ్వగలిగిన రకాలను అందిస్తే, విజయవంతం కాగలవన్నారు. అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్ మాట్లాడుతూ ఐఐఎంఆర్ ఇచ్చిన 11 రకాల సజ్జ, ఆరు జొన్న రకాలతోపాటు వ్యవసాయశాఖ రెండు, తన సొంతంగా మరో రెండు రకాల మొత్తం 21 రకాల సజ్జ, జొన్న పంటలను సాగుచేసినట్టు తెలిపారు. లాం ఫారం చిరుధాన్యాల శాస్త్రవేత్త డాక్టర్ పుష్పరేణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి మాట్లాడారు. కొల్లిపర వ్యవసాయాధికారి వెంకట్రావు స్వాగతం పలికారు. రైతులు, వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి



సమస్యలు తెలుసుకుంటున్న సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నగరంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి మంగళగిరి పట్టణంలోని నాలుగవ వార్డులో గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా జరిగిన అభివృద్ధి ప్రజలకు వివరించడంతో పాటు వారికి స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, మండవ కృష్ణ, తోట శ్రీనివాసరావు ఎండీ ఫిరోజ్, మల్లవరపు సుధారాణి, బేతపూడి నరసయ్య, నళిని పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండ



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ పేదింటి ఆడ బిడ్డలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. మంగళవారం దుగ్గిరాల గ్రామంలో అంజుమన్ షాదీ ఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ – డిసెంబర్ 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 10,132 జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద వధువుల తల్లుల ఖాతాల్లో రూ.78.53 కోట్లు ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులను విడుదల చేయడం హర్షణీమన్నారు. గౌరవ ప్రదంగా వివాహం జరిపించేందుకు షాదీ తోఫా పథకం అమలు చేసి, నగదు సాయం రూ. 50 వేల నుంచి రూ.లక్షకు పెంచి అందిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు సయ్యద్ జానీ, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

తాడేపల్లిరూరల్ : వలంటీర్ల సేవలు అభినందనీయమని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని, పెరికలపూడి, మోరంపూడి, పెదపాలెం, శృంగారపుం గ్రామాల వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవామిత్ర సర్టిఫికేట్లు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ మాట్లాడుతూ వలంటీర్లు సేవా దృక్పథంతో ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనంతో పేద ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని అన్నారు. గతంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి సామాజిక పెన్షన్లు అందజేయడం, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయించడం, కులధ్రువీకరణ పత్రాలు అందజేయడం వంటి కార్యక్రమాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. 91 మంది వలంటీర్ల సేవా రత్న పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు నవరాణి, వెంకటరావు, సుల్తాన్, రామలింగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ విమాదేవి

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో విమాదేవి అన్నారు. యర్రగుంట్లపాడు గ్రామంలో నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీడీవో పరిశీలించారు. వైద్యులు ప్రజలకు అందిస్తున్నసేవలను వైద్యాధికారి యానిగ్రేస్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలని వలంటీర్లకు తెలిపారు. శిబిరంలో 367 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్లు డాక్టర్ యానిగ్రేస్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు లోహిత్, చంద్రహర్షిత, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీ ఖాజాబి, ఆరోగ్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసిన పొలాల పరిశీలన



బుర్రిపాలెంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏవో వెంకటేశ్వర్లు

తెనాలిటౌన్: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించి ఈ కెవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. రూరల్ మండలం నేలపాడు, బుర్రిపాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు ఈ క్రాప్ నమోదు చేస్తున్న పొలాలను సందర్శించి, నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. రైతులు తమ పొలాలను ఈ క్రాప్ చేయించుకుని ఆర్‌బీకేలలో ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ జాబితాలో ఉండి ఆధార్‌కు బ్యాంకు ఖాతా లింక్ కానీ వారు బ్యాంకు మేనేజర్‌ను కలిసి ఆధార్‌కు బ్యాంకు ఖాతాను నమోదు చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ మండల గ్రామాల్లో మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా ఈ కెవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో జి.మోహనరావు, వీఏఏలు కె.హర్షిష్ వర్మ, పి.దీప్తి, రైతులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటి రోజు స్వామివారిని పెళ్లి కుమారుని చేసి విశేష పూజలు చేశారు. సాయంత్రం విష్వక్సేన పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆగమ పండితులు ఎస్‌జీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఆయల కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే స్వామివారి ఉత్సవాల్లో ప్రతిరోజు విశేష పూజలు, హోమాలు, సేవలు ఉంటాయని తెలిపారు. దీక్షతో వైఖానస ఆగమయుక్తంగా ఉత్సవాలు జరుగుతాయని అర్చకులు కిరణ్ కుమార్, నిఖిల్ తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరా రు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయనంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, మూర్తి వెంకటేశ్వరరావు దంపతులు, ఆలపాటి వీరభద్రరావు దంపతులు, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.